
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
**
రంజాన్ వేళలు | ఇఫ్తార్: 6.36 | సహర్ : 4.40 (గురువారం)



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.159	231	261
సూర్యాపేట	రూ. 150	220	250
నల్లగొండ	రూ.159	231	262


ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 24.2

లోక్‌సభ ఎన్నికలను అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఈ ఎన్నికల్లో మెజార్టీ ఎంపీ సీట్లను కైవసం చేసుకుని, లోక్‌సభ ఎన్నికల్లో తిరుగులేని ఆదిపత్యాన్ని కొనసాగించేందుకు అధికార కాంగ్రెస్ సన్నద్ధమవుతోంది. గత వైభవాన్ని చాటుకునేందుకు బీఆర్ఎస్, తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈనేపథ్యంలో అన్ని ప్రధాన పార్టీలు కూడా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను చేపట్టి, ఎన్నికల్లో గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)


మద్దతు ఇవ్వరూ!

- పార్టీల్లోని సీనియర్ నేతలతో అభ్యర్థుల సంప్రదింపులు
- ఎన్నికల్లో గెలుపు వ్యూహాలపై సమాలోచనలు
- సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు



నల్లగొండ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్‌నుంచి కుందూరు రఘువీర్‌రెడ్డిని, బీఆర్ఎస్ తరఫున కంచర్ల కృష్ణారెడ్డి, బీజేపీ నుంచి శానంపూడి సైదిరెడ్డి అభ్యర్థులుగా ఆయా పార్టీలు ప్రకటించాయి. భువనగిరి స్థానంలో కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నుంచి క్యామ మల్లేష్, సీపీఎం తరఫున ఎండీ జహంగీర్‌ను ప్రకటించాయి. అయితే ఎంపీ అభ్యర్థులు మాత్రం ఎన్నికల్లో సీనియర్ నేతలతోపాటు పార్టీలోని కీలకనేతల మద్దతు కోసం తిప్పలుపడుతున్నారు. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ అభ్యర్థులు జిల్లాలోని మంత్రులు, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌చార్జీలను, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులను సంప్రదిస్తున్నారు. వారిని కలిసి ఎన్నికల్లో తమకు పూర్తి సహకారాన్ని అందించాలని, గెలుపు వ్యూహాలపై సమాలోచనలు కూడా చేస్తున్నారు. పార్టీపరంగా తీసుకునే నిర్ణయాలను పకడ్బందీగా అమలు చేసేందుకు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కృషి చేయాలని కోరుతున్నారు.

ఆత్మీయ సమ్మేళనాల జోరు



ప్రధాన పార్టీ అభ్యర్థులు సామాజికవర్గాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి ఎన్నికల్లో మెజార్టీ ఓట్లు సాధించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కులాలవారీగా గర్జనలకు సిద్ధమవుతున్నాయి. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు, ఇబ్రహీంపట్నం(రంగారెడ్డిజిల్లా), జనగాం(జనగాం జిల్లా) నియోజకవర్గాలు ఉంటాయి.నల్లగొండ పార్లమెంట్ పరిధిలో నల్లగొండ, దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజుర్‌నగర్, కోదాడ, సూర్యాపేట నియోజకవర్గాలున్నాయి. బీజేపీ ఎస్సీ సామాజిక వర్గాల ఓటర్లను సాధించేందుకు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తోంది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి, పార్లమెంట్ స్థాయిలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సైతం ఆత్మీయ సమ్మేళనాలపై దృష్టి కేంద్రీకరిస్తోంది. నియోజకవర్గాల వారీగా పెద్దఎత్తున సమావేశాలు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు త్వరలోనే తేదీలను ఖరారు చేయనుంది. ఇక బీఆర్ఎస్ ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు నిర్వహించగా, ప్రత్యేకంగా సామాజికవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. అన్నిప్రధాన పార్టీలు కూడా మెజార్టీ ఓటర్లపై దృష్టి సారించాయి. మెజార్టీ సామాజిక వర్గాలు తమవైపే ఉన్నారన్నభావనలో పార్టీలు ముందుకు సాగుతున్నాయి. ఎవరివైపు మొగ్గుచూపుతారో అన్నది వేచిచూడాల్సిందే.

సమన్వయంతో పనిచేస్తే విజయం సునాయాసం

ఎన్నికలకు నెలరోజుల ముందుగానే పార్టీల్లోని టికెట్ ఆశించిన నేతలతోపాటు అసంతృప్త నేతలను కూడా కలిసి వారి మద్దతు కోరుతున్నారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు టికెట్ నిర్ణయం జరిగిందని, ఈఎన్నికల్లో సమన్వయంతో పనిచేస్తే విజయం సునాయాసంగా ఉంటుందని విన్నవించుకుంటున్నారు.ఇక బీజేపీ నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహిస్తోంది. నిత్యం ఏదో ఒక నియోజకవర్గంలో పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ, ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓటర్లను తమవైపు తిప్పుకునేలా వ్యూహాలకు పదును పెడుతోంది. అవసరమైతే జాతీయస్థాయి నేతలతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తోంది. ఇక బీఆర్ఎస్ అధిష్ఠానం నియోజకవర్గాలవారీగా సమావేశాలు పూర్తిచేసింది. ప్రస్తుతం లోక్‌సభ నియోజకవర్గ కేంద్రాల్లో అన్ని అసెంబ్లీల నేతలు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లు పర్యటించారు. పార్టీ పూర్వ వైభవానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మెజార్టీ స్థానాల గెలుపు కోసం అన్ని పార్టీలు కూడా సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.

గతేడాది టోల్‌గేట్ చార్జీలే..

యథాతథం

- చార్జీల పెంపునకు విరామం
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం



పంతంగి టోల్‌గేటు వద్ద కొత్త రేట్ల పట్టిక

టోల్‌ప్లాజాల వద్ద గతేడాది చార్జీలను కొనసాగిస్తూ జాతీయ రహదారుల సంస్థ(నాయ్) నిర్ణయం తీసుకుంది. రెండు నెలల పాటు పాతచార్జీలను కొనసాగించనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ప్రతీ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త చార్జీలు అమల్లోకి వస్తుంటాయి. ఆ మేరకు ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు కొత్త చార్జీలను కూడా వసూలు చేశారు. అనంతరం నాయ్ సూచన మేరకు పాతచార్జీలను వసూలు చేస్తున్నారు. 7

'ఉపాధి' ఆన్‌లైన్ నమోదులో అక్రమాలు

- కూలీలకు ఫొటోలకు కుదరని పొంతన
- మస్టర్లలో ఇష్టమొచ్చిన ఫొటోలు, రాని కూలీలకు హాజరు





చిన్వెంల గ్రామంలో ఉపాధికూలీల స్థానంలో అరచేతి ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన మేట్

చివ్వెంల, ఏప్రిల్ 2 : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనుల్లో భారీగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలో 31 పంచాయతీలుండగా 11 వేల జాబ్‌కార్డులున్నాయి. అందులో 16 వేలకు పైగా కూలీలు ఉన్నట్లు సమాచారం. ఉపాధి పథకంలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీ ఒక్క ఫీల్డ్‌అసిస్టెంట్ సెల్‌ఫోన్ ద్వారా కూలీల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ మండలంలో కొందరు ఫీల్డ్‌అసిస్టెంట్లు, మేట్‌లు నిబద్ధతతో ఉద్యోగం చేస్తున్నా మరి కొందరు మాత్రం ఇష్టానుసారంగా హాజరు కాని కూలీలకు కూడా హాజరు వేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారు. చివ్వెంల మండల కేంద్రంతో పాటు గాయంవారిగూడెం, వట్టిఖమ్మంపహడ్, తిమ్మాపురం, మోదిన్‌పురం గ్రామాల్లో మస్టర్లలో అప్‌లోడ్ చేసిన ఫొటోలు వేరేవి కావడం, అందులో కూలీలు వేరే వారు ఉండడం విశేషం.

జరిగిన తప్పిదాలు

చివ్వెంలలో మార్చి 30వ తేదీన జరిగిన ఉపాధి పథకం పనుల్లో మస్టర్‌లో 10 మంది కూలీలు ఉండగా ముగ్గురికి హాజరు వేసి అరచేతి ఫొటోను ఆ గ్రామానికి చెందిన మేట్ అప్‌లోడ్ చేశాడు. ఇదే గ్రామంలో ఈ నెల 2వ తేదీన 80 మందికి పైగా కూలీలు ఉన్న ఫొటో అప్‌లోడ్ చేసి 8 మందికి హాజరువేశాడు. 50 మందికి పైగా కూలీలు ఉన్న ఫొటోలను అప్‌లోడ్ చేసి ఓ మస్టర్‌లో ముగ్గురి, మరొకదాంట్లో నలుగురికి, ఇలా వారికి ఇష్టమొచ్చినట్లు హాజరు వేస్తున్నారు. గాయంవారిగూడెంలో ఎర్రరంగులో ఉన్న ఫొటోను అప్‌లోడ్ చేసి నలుగురు కూలీలకు హాజరు వేశారు. వట్టిఖమ్మంపహడ్‌లో ముగ్గురు మాత్రమే కనబడే ఫొటోను అప్‌లోడ్ చేసి 10 మందికి హాజరువేశారు. వల్లభాపురంలో భూమి ఫొటోను తీసి ఓ వ్యక్తికి హాజరువేశారు.

తప్పులు చేస్తే చర్యలు తప్పవు

మస్టర్లలో తప్పులు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. కూలీలకు హాజరు విషయంలో ఎలాంటి తప్పులు జరిగినా, ఫొటోలు అప్‌లోడ్ విషయంలో అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు నిర్ధారణ జరిగినా చర్యలు తప్పవు.

- సంతోష్‌కుమార్, ఎంపీడీవో, చివ్వెంల

అధికారంలోకి వస్తే సీఏఏ,

ఎన్ఆర్‌సీ రద్దు

మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కోదాడ, ఏప్రిల్ 2 : దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే సీఏఏ, ఎన్ఆర్‌సీ రద్దు చేస్తామని మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మైనార్టీ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ ఎండీ జబ్బార్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌విందుకు హాజరై మాట్లాడారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్నివర్గాలకు రక్షణ ఉంటుందన్నారు. ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ముస్లింలు అండగా ఉండాలన్నారు. కోదాడలో ముస్లింల షాదీఖానాకు రూ.3 కోట్లు, ఈద్గా అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మునిసిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీలరమేష్, వంగవీటి రామారావు, బషీర్, అల్తాఫ్ హుస్సేన్, బాగ్దాద్, ఎజాజ్, బాషుమియా, పారా సీతయ్య, పాలూరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పది ప్రశ్నపత్రాల

మూల్యాంకనం

సూర్యాపేటఅర్బన్, ఏప్రిల్ 2: పదో తరగతి విద్యార్థుల ప్రశ్నపత్రాల మూల్యాంకనాన్ని నేటి నుంచి నిర్వహించనున్నారు.అందుకోసం జిల్లాలో కేటాయించిన ఏకైక మూల్యాంకనం కేంద్రమైన సూర్యాపేట మండలం ఇమాంపేటలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఈ నెల 11వ తేదీ వరకు జరిగే మూల్యాంకనాన్ని డీఈవో అశోక్‌తో పాటు క్యాంప్ అధికారి పర్యవేక్షించనున్నారు. అసిస్టెంట్ క్యాంప్ అధికారులుగా ఏడుగురు, చీఫ్ ఎగ్జామినర్లు 52 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 264, స్పెషల్ అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా 98 మంది విధులు నిర్వహించనున్నారు. ఈ మూల్యాంకన కేంద్రంలోకి సెల్‌ఫోన్లు నిషేధించారు. అదేవిధంగా విధులకు గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఈవో అశోక్ తెలిపారు.

వడదెబ్బ తగలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలి



ఆత్మకూర్(ఎస్) పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

ఆత్మకూర్ (ఎస్), ఏప్రిల్ 2 : వేసవి దృష్ట్యా ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతుందని, వడదెబ్బ తగలకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆత్మకూర్(ఎస్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి, మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే వ్యాధిగ్రస్తులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఏఎన్ఎం, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. అంతకుముందు పీహెచ్‌సీ పరిసర ప్రాంతాలను పరిశీలించి, మందుల వివరాలు, రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పీ కోటాచలం, డాక్టర్ మౌనిక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

చివ్వెంల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యం కలుగకుండ మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. మంగళవారం మండలంలోని కుడకుడలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, మాట్లాడారు. కాంటా వేసిన ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా వెంటనే ట్యాగింగ్ చేసి మిల్లులకు తరలించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వినోద్‌కుమార్, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గైర్హాజరు అధికారులపై చర్యలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గాల వారీగా పీవో, ఏపీవోలకు ఏర్పాటుచేసిన రెండు రోజుల శిక్షణకు హాజరుకాని అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో 2,832 మందికి 2,719 మంది హాజరుకాగా 113 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. బుధవారం మరోమారు శిక్షణ ఉంటుందని, హాజరు కాని వారికి షోకాజ్ నోటీసులతో పాటు ఆర్‌పీ యాక్ట్ ప్రకారం ఎఫ్ఐఆర్ నమోద చేస్తామన్నారు.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి




తుంగతుర్తిలో పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

తుంగతుర్తి, ఏప్రిల్ 2 : పోలింగ్ విధుల నిర్వహణపై పీవోలు, ఏపీవోలకు పూర్తి అవగాహన ఉండాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మంగళవారం మండలకేంద్రంలోని గురుకుల పాఠశాలలో అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణలో భాగంగా రెండోరోజైన మంగళవారం ఆమె హాజరై మాట్లాడారు. ఈవీఎంల పనితీరు ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మాక్ పోలింగ్ నిర్వహణ, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ల ఉపయోగంతో పాటు ఎన్నికల విధులకు సంబంధించిన అన్నిఅంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణారెడ్డి, అమీన్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్, అధికారులు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో 2 వేల ఏళ్ల నాటి

సీసపు నాణేలు



ఫణిగిరిలో మ్యూజియంలో బౌద్ధుల కాలం నాటి పురాతన వస్తువులు

- మార్చి 29న తవ్వకాల్లో లభ్యం
- గట్టుపై కొనసాగుతున్న తవ్వకాలు 7

ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటక్రైం, ఏప్రిల్ 2 : ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై పోలీస్ అధికారులతో ఏర్పాటుచేసిన సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి మాట్లాడారు. ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ఎన్నికల విధులపై సిబ్బందికి పూర్తి అవగాహన, రోల్ క్లారిటీ కలిగి ఉండాలని, ఒత్తిడి లేకుండా పనిచేయాలన్నారు. పారామిలిటరీ సిబ్బందిని ప్రణాళికబద్ధంగా నిబంధనల మేరకు ఎన్నికల విధుల్లో ఉపయోగించాలన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు రోజు నుంచి నేటి వరకు రూ.కోటి 18 లక్షల నగదు, రూ.5.25 లక్షల విలువైన 890 లీటర్ల మద్యం, రూ.కోటి 10 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.70.30 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, దుస్తులు, ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో రూ. 33 లక్షల విలువైన మద్యం సీజ్ చేయడం జరిగిందన్నారు. మొత్తంగా జిల్లావ్యాప్తంగా రూ.3.43 కోట్లు విలువైనవి సీజ్ చేశామన్నారు. సమావేశంలో ఆర్మ్‌డ్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా, డీఎస్పీలు రవి, శ్రీధర్‌రెడ్డి, మట్టయ్య, శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవ, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై దృష్టి సారించాలి



మఠంపల్లిలో గ్రామకార్యదర్శులతో సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

మఠంపల్లి, ఏప్రిల్ 2: నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామకార్యదర్శులు మౌలిక వసతుల ఏర్పాటుపై దృష్టి సారించాలని డీపీవో సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో తాగునీరు, పారిశుధ్యం, ఇంటి పన్నులు, ఎన్నికల నియమావళిపై గ్రామకార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జూన్ చివరి వరకు ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు తలెత్తవద్దన్నారు. మూగ జీవాల కోసం అక్కడక్కడ నీటి తొట్టిలను ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీరు నింపాలన్నారు. సమస్యలు ఉంటే మండల స్థాయి అధికారులకు వెంటనే తెలపాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఈసీ సూచనలు పాటించాలని, అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి, డీఎల్‌పీవో యాదగిరి, ఎంపీడీవో మామిడి జానకిరాములు, ఎంపీవో అంజానేయులు, గ్రామకార్యదర్శులు తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో నీటి సమస్యలను పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రియాంక

కోదాడ రూరల్, ఏప్రిల్ 2 : గ్రామాల్లో మంచినీటి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులు, మండల ప్రత్యేకాధికారులను అదనపు కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. దోరకుంట, నల్లబండగూడెం, తొగర్రాయి, కూచిపూడి, కాపుగల్లు, గణపవరం గ్రామాల్లో నీటి సమస్య అధికంగా ఉందని ఫిర్యాదులు వచ్చాయన్నారు. వేసవిలలో తాగునీరు సరఫరా చేసే బోర్లు కాలిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అవసరమైతే కొత్త మోటార్లు ఏర్పాటు చేయాలన్నారు. మంచినీటి బోర్లు ఎండిపోతే ప్రత్యామ్నాయంగా దగ్గరలోని వ్యవసాయ మోటార్లను అద్దె ప్రాతిపదికన తీసుకుని ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటిని అందించాలని కోరారు. తాగునీటి సరఫరాలో ప్రభుత్వం ఎంతో సీరియస్‌గా ఉందని ఆమె తెలిపారు. సమావేశంలో ఆర్డీవో సూర్యనారాయణ, మునిసిపల్ కమిషనర్ రమాదేవి, తహసీల్దార్ సాయిగౌడ్, ఎంపీవో రంగయ్య పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



కలెక్టరేట్ ముందు ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేట(కలెక్టరేట్), ఏప్రిల్ 2 : పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు నష్టపరిహారం, యాసంగి ధాన్యానికి రూ.500 బోనస్ అందజేయాలని మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేసి, అనంతరం ఏవో సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నీరు, విద్యుత్ అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ అసమర్థత మూలంగానే లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, కరువు పరిస్థితి నెలకొన్నాయని ఆరోపించారు. నీళ్లున్నా ఎందుకు రైతులకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వెంటనే రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు నెమ్మాది బిక్షం, మర్ల చంద్రారెడ్డి, జడ్పీటీసీ జీడి బిక్షం, మునిసిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు గండూరి ప్రకాష్, పీఏసీఎస్ చైర్మన్ కొణతం సత్యనారాయణరెడ్డి, బూర బాలుసైదులు గౌడ్, తూడి నరసింహారావు, బత్తుల ప్రసాద్, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి, యాదగిరిముదిరాజ్, ఏలక వినోద్ పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 513.10 అడుగులు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 513.10 అడుగులు(136.9932 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి ఎడమ కాల్వ ద్వారా 4,881 క్యూసెక్కుల నీటిని, జంటనగరాల తాగునీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 6,231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి ఎటువంటి నీటి రాక లేదు.

టోల్‌గేట్లలో గతేడాది చార్జీలే..

● చార్జీల పెంపునకు రెండు నెలల విరామం
● ఎన్‌హెచ్‌ఏఐ ఆదేశాలతో గతేడాది చార్జీలను కొనసాగిస్తున్న జీఎంఆర్



కొర్లపహాడ్ టోల్‌ప్లాజా

చౌటుప్పల్ / కేతేపల్లి, ఏప్రిల్ 2 : ప్రతీ ఏడాది ఏప్రిల్ 1 ఒకటవ తేదీ నుంచి పెరిగే టోల్‌చార్జీల బాదుడు రెండు నెలలు వాయిదా పడింది. జాతీయ రహదారుల సంస్థ(నాయ్) సూచన మేరకు గతేడాది టోల్‌చార్జీలను కొనసాగించనున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి(65)పై చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్ వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాలోని చిల్లకల్లు కూడా టోల్‌ప్లాజా ఉంది. ప్రతీ ఏడాది మాదిరే ఏప్రిల్ 1 నుంచి పెరిగిన చార్జీలను ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి(ఏప్రిల్ 1) వరకు సుమారు 20 గంటల పాటు వసూలు చేశారు. అనంతరం నాయ్ సూచన మేరకు పాతచార్జీలను రెండు నెలల పాటు కొనసాగిస్తూ హైవే డెవలపర్స్ ఆర్గనైజేషన్‌కు నాయ్ మౌలిక ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు జీఎంఆర్ సంస్థ పాతచార్జీలను వసూలు చేస్తున్నారు. గత సంవత్సరం నుంచి వసూలు చేసిన టోల్‌ఛార్జీలను సోమవారం రాత్రి (ఏప్రిల్1)అమల్లోకి తెచ్చినట్లు కొర్లపహాడ్ టోల్ ప్లాజా మేనేజర్ శివకుమార్ తెలిపారు.

వాహనాలు రకాలు	పంతంగి టోల్‌ప్లాజా వద్ద		కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద	
	సింగిల్	రిటర్న్ జర్నీతో కలిపి	సింగిల్	రిటర్న్ జర్నీతో కలిపి
కారు, జీపు, వ్యాన్	రూ.90	రూ.135	రూ.125	రూ.190
లైట్ కమర్షియల్ వెహికల్	రూ.140	రూ.210	రూ.200	రూ.300
బస్, ట్రక్‌లకు	రూ.290	రూ.435	రూ.415	రూ.625
హెవీ కన్‌స్ట్రక్షన్ వాహనానికి	రూ.450	రూ.675	రూ.645	రూ.970
పెద్ద వాహనానికి సింగిల్	రూ.560	రూ.845	రూ.805	రూ.1,210

ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో 2 వేల ఏళ్ల నాటి నాణేలు





ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో మార్చి 29న తవ్వకాల్లో బయటపడ్డ సీసపు నాణేలు, గతంలో తవ్వకాల్లో బయటపడ్డ బౌద్ధుల కాలం నాటి ప్రతిమలు, స్తంభాలు, ఇతర వస్తువులు

మోత్కూరు, ఏప్రిల్ 2 : సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో నిర్వహిస్తున్న తవ్వకాల్లో తాజాగా మార్చి 29న 2 వేల ఏళ్ల కిందటి సీసపు నాణేలు బయటపడ్డాయి. ఇవి శాతవాహనుల సామంతులైన మహాతలవరుల కాలం నాటి నాణేలుగా భావిస్తున్నారు. క్రీస్తుశకం రెండో శతాబ్దంలో ఇక్కడ బౌద్ధధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేశారని చెబుతారు. ఫణిగిరి కొండపై సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఈ బౌద్ధక్షేత్రం విస్తరించి ఉంది. ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన బౌద్ధక్షేత్రాల్లో ఫణిగిరి క్షేత్రం ఒకటి. అమరావతి, నాగార్జున కొండ బౌద్ధక్షేత్రాల కంటే ఈ క్షేత్రం గొప్పదంటారు. ఇక్కడ ఇక్ష్వాకులు 11 ఏళ్లు పరిపాలించినట్టు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. 1941లో అప్పటి నైజాం ప్రభువు కాలంలో ఈ క్షేత్రంలో తొలిసారి తవ్వకాలు జరిపారంటున్నారు. ఆ తర్వాత రాష్ట్ర పురావస్తు శాఖ వారు 2001 నుంచి 2007 వరకు ఒకసారి 2015లోనూ ఫణిగిరి గుట్టపై తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో మహాస్థూపం, చైత్య గుహలు, స్థూపాలు, గృహలు, శిలా మండపాలు, బుద్ధుడి పాదాలు, బుద్ధడి ప్రతిమలు, పాత్రలు, చిహ్నాలు, జాతక కథలు, సిద్ధార్థ గౌతమి జీవిత కథలు, అపురూపంగా మల్చిన శిల్పాలు, శాతవాహలు, ఇక్ష్వాకులు, మహాతరవరుల నాణాలు, బొమ్మలు బయటపడ్డాయి. కుండలు, కూజలు, కప్పులు, టైల్స్, బౌద్ధుల గదులు బయటపడ్డాయి. ఇందులో 32 గదులు ఉన్నాయి. బుద్ధుడి పాదాలు, బుద్ధుడి వ్యక్తిత్వానికి ప్రతీకలుగా భావించే అష్టమంగళం, చిహ్నాలు, మర్మచక్రం, మిథునం, అంకుశం, యజ్ఞాశం, ఖడ్గం, సప్తి, పిరస్నం గుర్తులు లభించాయి. ప్రపంచంలో ఎక్కడా లేని బుద్ధుడి తలపాగా ఇక్కడ లభ్యమైందని చెబుతారు. గతంలో ఇక్కడ బుద్ధవనం ప్రాజెక్ట్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించింది. తరచుగా దేశ, విదేశాల బౌద్ధ మత గురువులు, పురావస్తు పరిశోధకులు, అధ్యయనకారులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. మార్చి 11న ఈ బౌద్ధ క్షేత్రంలో మ్యూజియం ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతీ హోళికేరీ, కలెక్టర్ వెంకటరావు పాల్గొన్నారు. ఆ రోజు నుంచి పురావస్తు శాఖ అధికారులు ఇక్కడ మరోసారి తవ్వకాలు చేపట్టారు. రోజూ 65 నుంచి 75 మంది కూలీలు తవ్వకాల్లో పాల్గొంటున్నారు. ఆదివారం సెలవు రోజు తప్ప మిగతా రోజుల్లో తవ్వకాలు జరుపుతున్నారు. ఈ తవ్వకాల్లో గత నెల 29న 2 వేల ఏళ్ల కిందటి 3,700 సీసపు నాణేలు బయటపడ్డాయి. వాటిని కూలీల సమక్షంలోనే లెక్కించి భద్రపర్చినట్టు తెలిసింది. పురావస్తు శాఖ డైరెక్టర్ వచ్చి పరిశీలించిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తారని సమాచారం.

రూ.40కోట్లతో బుద్ధవనంలో అభివృద్ధి పనులు



బుద్ధవనంలో రూ.25కోట్లతో నిర్మించే డిజిటల్ మ్యూజియం స్థలాన్ని పరిశీలిస్తున్న రమేశ్‌నాయుడు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 274ఎకరాల్లో నిర్మించిన బుద్ధవనం ప్రాజెక్టును రూ.40కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు పర్యాటక శాఖ ఎండీ. రమేష్‌నాయుడు తెలిపారు. మంగళవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బుద్ధవనం ప్రాజెక్టులో అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా బుద్ధవనం ప్రాజెక్టులో రూ.25కోట్లతో డిజిటల్ మ్యూజియం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ పనులకు సంబంధించిన టెండర్లు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మరో రూ.15కోట్ల వ్యయంతో కొనసాగుతున్న షాపింగ్ కాంప్లెక్స్, సోలార్ పవర్ ప్లాంట్, సెంట్రలైజ్డ్ మ్యూజియం, వ్యూ పాయింట్, వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం హిల్‌కాలనీ విజయ్‌విహార్ వెనుక వైపు ఉన్న లాంచీ స్టేషన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో బుద్ధవనం ఓఎస్‌డీ సుదన్‌రెడ్డి, బౌద్ధ విశ్లేషకుడు డాక్టర్ శివనాగిరెడ్డి, జీఎం ఉపేందర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ నజీశ్, విజయ్‌విహార్ మేనేజర్ ఎల్లస్వామి, సూపర్‌వైజర్ విష్ణు తదితరులు ఉన్నారు.

గుట్టలో క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 2: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొండపైన విష్ణుపుష్కరిణి చెంత ఆంజనేయస్వామిని అర్చకస్వాములు వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసి సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు ముఖమండపంలో సుదర్శన నారసింహహోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 35,29,018 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు.

మానవతావాది 'దాసి' సుదర్శన్



సుదర్శన్ పార్థివదేహం ఎదుట నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మిర్యాలగూడ, ఏప్రిల్ 2 : మానవతావాది, వామపక్ష భావజాలంతో కడదాక ముందుకు సాగిన విలక్షణ, చిత్రకారుడు 'దాసి' సుదర్శన్ అని వక్తలు అభిప్రాయపడ్డారు. మంగళవారం పిట్టంపల్లి సుదర్శన్ అలియాస్ 'దాసి' సుదర్శన్ పార్థివదేహాన్ని సందర్శించి వివిధ సంఘాల నేతలు, శేషు మిత్రమండలి సభ్యులు నివాళులర్పించారు. సుదర్శన్ సతీమణి స్వతంత్రను పరామర్శించారు. బంధు, మిత్రుల అశ్రునయనాల మధ్య మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటి వద్ద ఏర్పాటుచేసిన సంతాప సభలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, కార్టూనిస్ట్ శంకర్, నర్సిం తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభించి విభిన్న రంగాల్లో తన ప్రతిభా పాటవాలను ప్రదర్శించారని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్‌గా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పుస్తక రచయితగా, కార్టూనిస్టుగా, జర్నలిస్ట్‌గా, ఫొటోగ్రాఫర్‌గా, ఉపన్యాసకుడిగా, చిత్రకారుడిగా, గాయకుడిగా ఆయన ప్రతిభను కనబరిచారని గుర్తు చేశారు. పిట్టంపల్లి సుదర్శన్ దాసి చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేసి జాతీయ అవార్డు పొంది 'దాసి' సుదర్శన్‌గా ప్రజలకు మరింత చేరువయ్యారని అన్నారు. పౌరాణిక రంగస్థల నటుడు మట్టయ్య కుమారుడిగా సుదర్శన్ కళలను పుణికి పుచ్చుకున్నాడని అన్నారు. 'అల' అనే కళావేదిక స్థాపించి సాహిత్య సభలను నిర్వహించారని తెలిపారు. కాగా సుదర్శన్‌కు సంతానం లేకపోవడంతో అతడి అన్న కుమారుడు చక్రవర్తి సుదర్శన్ చితికి నిప్పంటించారు. అంత్యక్రియల్లో మానవహక్కుల వేదిక నాయకులు పీ సుబ్బారావు, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య, నాయకులు యోగానంద్ భిక్షమయ్య, కస్తూరి ప్రభాకర్, రచయితలు వేణు సంకోజు, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కృష్ణమూర్తి, మధుసూదన్, తిరుమల్‌రావు, ఎలికట్టె శంకర్‌రావు కార్టూనిస్టులు విఘ్నేశ్వరాచారీ(చిత్ర), వడ్డేపల్లి వెంకటేశ్, గుండు శ్రీనివాస్, ఇనుగుర్తి విజయ్, వివిధ సంఘాల నేతలు కిరణ్మయి, జ్వాల వెంకటేశ్వర్లు, చెరుకు సుధాకర్, రవి, రామోహన్‌రాజు, గోపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రకాశ్, పంకజ్, జాడి రాజు, ప్రసాద్, వివిధ పత్రికల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

అనాథగా రిక్షా కార్మికుడి మృతి



తిరుమలగిరిలోని ఆదర్శనగర్‌లో యాదగిరి మృతదేహాన్ని ఆటోలోకి ఎక్కిస్తున్న మునిసిపల్ సిబ్బంది, యాదగిరి (ఫైల్ ఫొటో)

తిరుమలగిరి, ఏప్రిల్ 2: నాలుగేళ్ల క్రితం భార్య మృతి చెందింది... రెండేళ్ల క్రితం కుమార్తెకు వివాహమై అత్తవారింటికి వెళ్లింది. రెక్కల కష్టం మీద రిక్షా తొక్కుతూ ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇంట్లోనే కిందపడగా, సకాలంలో ఆయనను ఆసుపత్రికి తరలించేవారులేక ప్రాణాలు కోల్పోయాడు. మూడు రోజుల క్రితం ఈ ఘటన జరిగినా ఎవరూ గుర్తించలేదు. ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల ఇళ్లవారు వెళ్లి చూడటంతో ఈ ఘటన వెలుగు చూసింది. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తిరుమలగిరిలోని ఆదర్శనగర్ 3వ వార్డుకు చెందిన పులుసు యాదగిరి(50) రిక్షా కార్మికుడు. భార్య నాలుగేళ్ల క్రితం మృతిచెందగా, కుమార్తె రేణుక రెండేళ్ల క్రితం తిరుమలగిరికి చెందిన వెంకన్నను ప్రేమ వివాహం చేసుకుంది. దీంతో యాదగిరి తన చిన్న ఇంటిలో ఒంటరిగా నివసిస్తున్నాడు. ఆ వీధిలో నాలుగైదు ఇళ్లు మాత్రమే ఉంటాయి. అక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో అంబేడ్కర్‌నగర్‌లో నివాసం ఉండే కుమార్తె అప్పుడప్పుడు తండ్రి వద్దకు వచ్చి బాగోగులు చూసుకుంటుంది. భారీకాయుడైన యాదగిరి ఇంట్లో కిందపడటంతో తల పగిలి రక్తస్రావమై స్పృహ కోల్పోయాడు. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించేవారులేక మృతి చెందాడు. మంగళవారం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు యాదగిరి ఇంట్లోకి వెళ్లి చూడగా కింద పడి మృతిచెందినట్లుగా గుర్తించి కుమార్తెకు సమాచారమిచ్చారు. మృతదేహం నుంచి దుర్వాసన వస్తున్నందున దగ్గరకు ఎవరూ వెళ్లలేదు. యాదగిరి మృతదేహాన్ని శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్, కార్మికులు అంజి, సాల్మన్, చేత రాములు దుప్పటిలో చుట్టి మునిసిపల్ వాహనంలో శ్మశానవాటికకు తరలించారు. కుమార్తె, అల్లుడు సమక్షంలో మునిసిపల్ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో గుంతను తీయించి మృతదేహాన్ని పూడ్చిపెట్టి మానవత్వం చాటారు. యాదగిరి మృతదేహానికి కుమార్తె అంత్యక్రియల క్రతువు నిర్వహించింది. మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ సంకెపల్లి రఘునందన్‌రెడ్డి మునిసిపల్ సిబ్బందికి రూ.5వేల విలువైన పీపీఈ కిట్లు, కుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.

సాగర్ మాజీ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ సీజ్





భగత్ క్యాంప్ కార్యాలయాన్ని సీజ్ చేస్తున్న అధికారులు, 14వ మైలురాయి వద్ద పోలీసులతో వాగ్వాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 2: నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ క్యాంపు కార్యాలయాన్ని ఎన్నెస్పీ, రెవెన్యూ అధికారులు మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. ఇంట్లో ఉన్న సామాన్లన్నింటినీ మునిసిపల్ వాహనాల్లో ఎన్నెస్పీ కార్యాలయానికి తరలించారు. అనంతరం గేటుకు తాళం వేసి సీజ్ చేశారు. ఈ విషయంపై ఎన్నెస్పీ ఈఈ మల్లిఖార్జున్‌రావును వివరణ కోరగా మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ ఇంతకాలం నివాసమున్న భవనం తన సొంత ఇల్లు కాదని, క్యాంపు కార్యాలయంగా తమ రికార్డుల్లో ఉందని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి క్యాంపు కార్యాలయాన్ని అప్పగించేందుకు పలుమార్లు భగత్‌ను క్యాంప్ ఆఫీస్‌ను ఖాళీ చేయాలని నోటీసులు పంపినా ఆయన పట్టించుకోలేదన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయాన్ని సీజ్ చేసి గేటుకు తాళం వేశామని తెలిపారు. కార్యక్రమంలో పెద్దవూర తహసీల్దార్ పావని సరోజ, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, జేఈ బిక్షమయ్య, సీఐ వీసన్న, ఎస్ఐ సంపత్ ఉన్నారు. కాగా హైదరాబాద్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌ను ఫోన్‌లో సంప్రదించగా తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే ఎన్నెస్పీ అధికారులు తాను నివాసం ఉంటున్న ఇంటిని సీజ్ చేశారని అన్నారు. ఈ విషయంలో చట్టపరంగా ముందుకు వెళ్తానని తెలిపారు.

బీఆర్ఎస్ కార్యకర్తల ధర్నా

సాగర్‌హిల్‌కాలనీలోని తన క్యాంప్ కార్యాలయాన్ని సీజ్ చేశారని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నోముల భరత్ హైదరాబాద్ నుంచి హుటాహుటిన సాగర్‌కు బయలుదేరారు. ఆయన్ను మార్గమధ్యలో పోలీసులు 14వ మైలురాయి వద్ద అరెస్టు చేశారు. అరెస్టు విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు హిల్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకుని ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పొదిలి శ్రీను, భానునాయక్, మల్లికార్జునతో పాటు పలువురు పాల్గొన్నారు.

రాజకీయ కార్యక్రమాలకు వినియోగిస్తుండటంతోనే

నల్లగొండ, ఏప్రిల్ 2: ప్రభుత్వం కేటాయించిన అధికారిక క్యాంపు కార్యాలయాన్ని సకాలంలో ఖాళీ చేయకపోవడమే కాకుండా, లోకసభ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నప్పటికీ క్యాంపు కార్యాలయాన్ని రాజకీయ కార్యక్రమాలకు వినియోగించుకున్నందుకు నాగార్జునసాగర్ ప్రాజెక్టు హిల్ కాలనీలోని ఎమ్మెల్యే అధికారిక క్యాంపు కార్యాలయాన్ని తక్షణమే సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన ఒక ప్రకటనలో తెలిపారు.

రూ.21.58 లక్షల
నగదు పట్టివేత

వలిగొండ, నార్కట్‌పల్లి, చిట్యాల రూరల్, కోదాడ రూరల్, నాగారం, తిప్పర్తి, ఏప్రిల్ 2: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న 21,58,069 రూపాయల నగదును మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన గర్దాసు శివకుమార్ తన బైక్‌పై రూ.5,04,569 నగదును తరలిస్తుండగా వలిగొండ మండలం నాగారం మధిర గ్రామం కమ్మగూడెం వద్ద తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో చేపట్టిన తనిఖీల్లో అమ్మనబోలు గ్రామానికి చెందిన వ్యాపారి తన బైక్‌పై సుంకి వెంకటేశ్వర్లు రూ.9.50లక్షల నగదును తీసుకెళ్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు. చిట్యాల మండలం వట్టిమర్తి స్టేజీ వద్ద నిర్వహించిన తనిఖీల్లో హైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్తున్న వాహనంలో ఎలాంటి ఆధారాలు లేని రూ.2.39లక్షల నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ సైదాబాబు తెలిపారు. రాష్ట్ర సరిహద్దు సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారులో ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.55 వేల నగదు పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. నాగారం మండల కేంద్రంలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై పోలీసులు తనీఖీ చేస్తుండగా బొలెరో వాహనంలో పత్తి వ్యాపారి షేక్ సైదా ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటిరెడ్డి తెలిపారు. తిప్పర్తి మండల కేంద్రంలో బొలెరో వాహనంలో వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం గోపాలాపురం గ్రామానికి చెందిన ఎల్లబోయిన బుచ్చయ్య నుంచి రూ.80వేలు, అదేవిధంగా జనగాంకు చెందిన శ్రీను వాహనంలో రూ.79,500 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు. కొండమల్లేపల్లి ఆర్టీసీ బస్టాండు వద్ద నిర్వహించిన తనిఖీలలో రూ.1.50లక్షల నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

300 కిలోల బెల్లం స్వాధీనం

హుజూర్‌నగర్, ఏప్రిల్ 2 : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మఠంపల్లి, చింతలపాలెం మండలాల్లో నల్లగొండ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సూర్యాపేట డీటీఎఫ్ అధికారులు దాడులు చేశారు. మంగళవారం పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో దాడుల వివరాలను జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మానాయక్ వివరించారు. చింతలపాలెం మండల కేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వచేసిన 300 కిలోల నల్లబెల్లాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇంటి యజమాని పరారీలో ఉన్నాడని, అదే గ్రామానికి చెందిన చిత్తలూరి లక్ష్మీ సారా విక్రయిస్తుండగా ఆమె నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మఠంపల్లి మండలంలోని అవిరేనికుంటతండా, సుల్తాన్‌పూర్‌తండా, రామచంద్రాపురం తండాల్లో దాచిన సుమారు 900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. మఠంపల్లి మండలం కాలువపల్లి తండాకు చెందిన బాణోతు కోటా, బాణోతు సోముడు చౌటపల్లి గ్రామానికి 10 లీటర్ల సారా తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. బాణోతు సోముడు పరారీ కాగా ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ నాగార్జునరెడ్డి, రాకేష్, మల్లయ్య, శంకర్, జగన్మోహన్‌రెడ్డి, రవి, నరేష్, నాగరాజు, రుక్మారెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

దేవరకొండలో..

దేవరకొండ, ఏప్రిల్ 2 : నల్లగొండ జిల్లా దేవరకొండ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. జాల్‌తండా, గోనబోయినపల్లి, టి.గౌరారం, జేత్యతండా, పద్మట్‌పల్లితండా, మేగ్యాతండాలలో దాడులు నిర్వహించి 18 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని ముగ్గురుని అరెస్ట్ చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సహకారంతో దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 18 లీటర్ల నాటుసారా, 18 కేజీల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ఇరుకు.. ప్రయాణం బెరుకు

ఇరుకు రోడ్డుతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల ఇబ్బందులు




మట్టపల్లి శివారులో బోల్తా పడిన లారీ (ఫైల్ ఫొటో)

మఠంపల్లి, మార్చి 2: హుజూర్‌నగర్ నుంచి మఠంపల్లి మీదుగా మట్టపల్లి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా దాచేపల్లి వరకు డబుల్ లైన్‌తో నిర్మించిన అంతర్రాష్ట్ర రహదారి ఇరుకుగా ఉన్నందున వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నుంచి నిత్యం వందల సంఖ్యలో వాహనాలు ఇరు రాష్ట్రాలకు రాకపోకలు సాగిస్తున్నందున రద్దీతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి నుంచి ఏపీలోని మేదరమట్ల నాలుగు లేన్లకు అనుసంధానంగా వేసిన ఈ డబుల్ రోడ్డులో భాగంగా మఠంపల్లి మండలం మట్టపల్లిలోని కృష్ణానదిపై రెండు తెలుగు రాష్ట్రాలకు వారధిగా హైలెవల్ వంతెనను రూ.50కోట్లతో నిర్మించి ప్రారంభించారు. తెలంగాణలోని కిష్టపట్టి ప్రాంతంలో పేరొందిన పలు సిమెంట్ పరిశ్రమలు, ప్రసిద్ధ మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రం ఉన్నదున నిత్యం ఈ రోడ్డులో వందలాది లారీలు, కార్లు, టిప్పర్లు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ రోడ్డు ఇరుకుగా ఉన్నందున వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా మారింది.

రోడ్డును విస్తరిస్తేనే ప్రమాదాలకు చెక్

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సంబంధబాంధవ్యాలు ఎక్కువగా ఉండడంతో పాటు వాణిజ్య పంటలైన పత్తి, మిరప రైతులు, వ్యాపారులు, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తరుచుగా రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వాహనాల రద్దీతో ఏర్పడిన ప్రమాదాలతో దాచేపల్లి, తంగెడ, పెదవీడు, మఠంపల్లి, బక్కమంతులగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి మహాక్షేత్రం వరకు ఉన్న 25కిలోమీటర్ల రోడ్డును నాలుగులైన్లుగా విస్తరిస్తే పరిశ్రమ నుంచి వచ్చే వాహనాల రద్దీ నుంచి కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సంప్రదించి మట్టపల్లి కృష్ణా నదిపై నిర్మించిన హైలెవల్ వంతెన నుంచి కేవలం 15కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏపీ రాష్ట్రంలోని దాచేపల్లి వరకు రోడ్డును నాలుగులైన్లుగా విస్తరించే ఇరురాష్ట్రాల రాకపోకలను మార్గం సులభమవుతుందని వాహనదారులు, స్థానికులు చెబుతున్నారు.

నాలుగు లేన్లుగా విస్తరించాలి



రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ మట్టపల్లిలో కృష్ణానదిపై నిర్మించిన వంతెనతో రాకపోకలు భారీగా పెరిగాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉన్నందున తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి రోడ్డును నాలుగులేన్లుగా విస్తరించాలి.

\- మాలోతు సక్యనాయక్, మఠంపల్లి

ప్రభుత్వపరంగా ఎలాంటి ఆదేశాలు రాలేదు

హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు నాలుగు లేన్ల ఏర్పాటు కోసం ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే నిబంధనల మేరకు పనులు చేస్తాం. మట్టపల్లి వంతెన ఏర్పాటుతో ఈ రహదారి రద్దీగా మారింది. హుజూర్‌నగర్ నుంచి మట్టపల్లి వరకు రోడ్డు పలు ప్రాంతాల్లో ఎగుడు, దిగుడు ఉంది. ఈ ప్రాంతాల్లో మరమ్మతులకు గురవుతోంది. రోడ్డును రెండు వైపులా లెవలింగ్ చేసి తారు పనులు వేసేందుకు ప్రభుత్వానికి రూ.15కోట్లతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే టెండర్లను ఆహ్వానించి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

\- శివకుమార్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

ఆత్మకూర్(ఎస్), ఏప్రిల్ 2: కారు అదుపు తప్పి పల్టీలు కొట్టి రోడ్డు పక్క ఉన్న కంప చెట్లలోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురు స్వామీజీలకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండకు చెందిన స్వామిజీలు సూర్యాపేట నుంచి హనుమకొండకు కారులో వెళుతుండగా, మండలంలోని నంద్యాలగూడెం స్టేజీ సమీపంలో రోడ్డు ఎగుడుదిగుడుగా ఉండటంతో కారు ఒక్కసారి అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకువెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు స్వామిజీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా, నంద్యాలగూడెం స్టేజీ నుంచి బోరింగ్ తండా వరకు రోడ్డు ఎగుడుదిగుడుగా ఉన్నందున పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

మట్టిని తరలిస్తున్న తొమ్మిది టిప్పర్ల పట్టివేత

హుజూర్‌నగర్, పెన్‌పహాడ్, ఏప్రిల్ 2: హుజూర్‌నగర్, పెన్‌పహాడ్ మండలాల్లో మట్టిని తరలిస్తున్న తొమ్మిది టిప్పర్లను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శ్రీనివాసపురంలో ఉన్న చిన్నచెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఏడు టిప్పర్లను స్వాధీనం చేసుకుని, వాహనాల యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇటుక బట్టీల యజమానులు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారని, ఈ మేరకు విచారణ చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

●మట్టిని అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను పెన్‌పహాడ్ మండలంలోని అనంతారం క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ పెరక రవీందర్ తెలిపారు.టిప్పర్ల యజమానులపై కేసు నమోదు చేసి, టిప్పర్లను తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఆయన తెలిపారు.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మేళ్లచెర్వు, ఏప్రిల్ 2: కృష్ణానదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. చింతలపాలెం ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుగ్గమాధారం గ్రామ శివారులో బుగ్గవాగు కృష్ణానదిలో కలిసే ప్రాంతంలో సుమారు 55 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని అన్నారు. చుట్టు పక్కల గ్రామాల పరిధిలో మిస్సింగ్ అయినవారుంటే ఆ కుటుంబాల సభ్యులు పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఆవులు తరలిస్తున్న ఇరువురిపై కేసు

కోదాడ రూరల్, ఏప్రిల్ 2: ఆవులు తరలిస్తున్న ఇద్దరిపై పోలీ సులు కేసు నమోదు చేశారు. కోదార రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని హనుమాన్ జంక్షన్ నుంచి హైదరా బాద్‌కు ఓ వాహనంలో 19ఆవులు, దూడలను తరలిస్తుండగా, రామాపురం చెక్‌పోస్టు వద్ద మంగళవారం చేసిన తనిఖీల్లో గుర్తించిస్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ఆవులను హైదరాబాద్‌కు తరలిస్తున్న తాజుద్దీన్, ఆరీఫ్‌ఖాన్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. స్వాధీనం చేసుకున్న ఆవులను గోశాలకు తరలిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి సహా ట్రాక్టర్ దగ్ధం

మేళ్లచెర్వు, ఏప్రిల్ 2: కరెంట్ తీగలు తగిలి ట్రాక్టర్‌తో సహా గడ్డి కాలిపోయింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ..రేవూరు గ్రామానికి చెందిన పంగ సైదులు పశుగ్రాసం కోసం బంధువుల గ్రామమైన గానుగబండ నుంచి ఎండుగడ్డిని మంగళవారం కొనుగోలు చేసి ట్రాక్టర్లలో తీసుకువస్తుండగా, రేవూరు గ్రామ శివారులో విద్యుత్ తీగలకు తగిలి మంటలు అంటుకుని వరిగడ్డితో సహా ట్రాక్టర్‌తో పాటు ట్రక్కు పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.10లక్షల ఆస్తి నష్టం సంభవించిందని బాధిత రైతు సైదులు తెలిపారు.

న్యాయవాదులు బాధ్యతగా వ్యవహరించాలి

హుజూర్‌నగర్, ఏప్రిల్ 2: న్యాయవాదులు వృత్తిపరంగా బాధ్యతగా వ్యవహరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రామిరెడ్డి కోరారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో సంఘం ఉపాధ్యక్షుడు జక్కుల నాగేశ్వరరావు, కోశాధికారి బాణోతు సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ హుజూర్‌నగర్‌లో న్యాయస్థానాల పెంపు, మౌలిక వసతుల కల్పన, సిబ్బంది భర్తీ వంటి సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జక్కుల వీరయ్య, కాలువ శ్రీనివాసరావు, నట్టె సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, నగేష్, రవికుమార్, సుందర్ తదితరులు పాల్గొన్నారు

రూ.31లక్షలతో పాఠశాలలో మౌలిక వసతులు

నడిగూడెం, ఏప్రిల్ 2: మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో రూ.31లక్షలతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్‌డీ ఇమాం తెలిపారు. మంగళవారం నడిగూడెం మండల పరిషత్‌లో సంఘబంధాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 16ప్రాథమిక పాఠశాలలు, నాలుగు ఉన్నత పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను నియమించి, మే ఐదో తేదీ లోపు పనులను పూర్తిచేయాలన్నారు. ఏపీఎం రామలక్ష్మి మాట్లాడుతూ మండల సమాఖ్య ద్వారా మరమ్మతు పనులు చేపట్టేందుకు కమిటీలు బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ రంగారావు, హెచ్ఎంలు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

నేరేడుచర్ల, ఏప్రిల్ 2: అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం నేరేడుచర్లలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కల్లూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో 'పుస్తకం చదువు' కార్యక్రమాన్ని నిర్వమించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, జిలక రామస్వామి, ఉపాధ్యాయులు వెంకటనర్సయ్య, గోపి, రామారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లిఫ్టుల ద్వారా చెరువులు, కుంటలు నింపాలి

మునగాల రూరల్, ఏప్రిల్ 2: లిఫ్టుల ద్వారా ప్రభుత్వం చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణి గ్రామంలో సీపీఎం గ్రామశాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వర్షాభావ పరిస్థితులతో చెరువుల్లో, కుంటల్లో నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటి గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందన్నారు. ప్రభుత్వం సాగర్ ఎడమకాల్వ నీటి ద్వారా చెరువులు, కుంటలు నింపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నందిగామ సైదులు, పోటు పుల్లయ్య నిడిగొండ శంబయ్య, రావులపెంట బ్రహ్మం, ముల్కలపల్లి సైదులు, నాగరాజు, ప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు చేరిన డిజిటల్ టోకెన్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోతె, ఏప్రిల్ 2: మండలంలో డిజిటల్ టోకెన్లు కార్యదర్శులకు అందాయి. మోతె మండల ఎంపీవోగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన హరిసింగ్‌నాయక్, గ్రామ కార్యదర్శులకు మధ్య 14వ ఆర్థిక సంఘానికి సంబంధించిన డిజిటల్ టోకెన్ల గొడవ జరుగుతోంది. గ్రామ పంచాయతీ డిజిటల్ టోకెన్లు కార్యదర్శులకు ఇవ్వకుండా ఇన్‌చార్జి ఎంపీడీవో తనవద్దే ఉంచుకోవడంతో గొడవలు జరుగుతున్నాయి. గ్రామ కార్యదర్శులు అడిగితే పనుల కోసం చెల్లించిన వాటికి సంబంధించిన క్యాష్‌బుక్‌లో తప్పులు ఉన్నాయని, ఏదో ఒక సాకు చెబుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామ కార్యదర్శులు ఆరోపించారు. ఈ ఉదంతాన్ని వివరిస్తూ 'ముదురుతున్న టోకెన్ల పంచాయితీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మార్చి 31న ప్రచురితమైన వార్తకు జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌కుమార్ స్పందించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచా యతీల కార్యదర్శులకు జిల్లా పంచాయతీ అధికారి సమావేశం ఏర్పాటు చేసి ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌నాయక్ వద్ద డిజిటల్ టోకెన్లకు కార్యదర్శులకు ఆయనే అందజేశారు. ఐదేళ్లుగా డిజిటల్ టోకెన్లు లేనందున ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ప్రస్తుతం సమస్య పరిష్కారమైందని పంచాయతీ కార్యదర్శులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు



మునగాల నుంచి కీతవారిగూడెం వరకు కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

మునగాల మండల కేంద్రం నుంచి గరిడేపల్లి మండలం కీతవారి గూడెం వరకు ఆర్అండ్‌బీ రోడ్డు పనులు, అదేవిధంగా మండలంలోని గణపవరం గ్రామం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజలకు రాకపోకలు సులువుగా ఉండేందుకు ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం రూ.8కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 108మీటర్ల బ్రిడ్జి పనులను పూర్తిచేయనున్నారు. అదేవిధంగా మునగాల మండల కేంద్రం నుంచి గరిడేపల్లి మండలం కీతవారిగూడెం వరకు 17కిలోమీటర్లు ఉన్న రోడ్డును డబుల్‌గా విస్తరించడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కీతవారిగూడెం నుంచి 11.5కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణ పనులను రూ.20 కోట్లతో పూర్తిచేశారు. మరో ఐదున్నర కిలోమీటర్లు మునగాల మండల కేంద్రం వరకు రోడ్డు నిర్మాణ పనులు చేయాల్సి ఉంది. ఈ పనులకు ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. అయితే ఎన్నికల కోడ్ నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రస్తుతం ఆగాయి. బ్రిడ్జి, రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నందున గరిడేపల్లి, చిలుకూరు, పెన్‌పహాడ్, మునగాల మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో నాలుగైదు నెలల్లో బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తవుతాయని ఆర్అండ్‌బీ ఏఈ సత్యనారాయణ తెలిపారు.

● మునగాల రూరల్

భక్తిశ్రద్ధలతో తిరువీధోత్సవం



తిరువీధోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 2: మండలంలోని మైహోం సిమెంట్ పరిశ్రమ కాలనీలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఐదో రోజు మంగళవారం వైభవంగా కొనసాగాయి. కల్యాణం అనంతరం అహోబిలం రామానుంజస్వామి వారి సమక్షంలో తీరువీధోత్సవం, ప్రణయకళ మహోత్సవం, దోపోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో అర్చకులు నిర్వహించారు. కార్యక్రమంలో చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, కుటుంబ సభ్యులు, కంపెనీ ప్రతినిధులు, ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.

పాపన్నగౌడ్ ఆశయాలను సాధించాలి



తుంగతుర్తిలో సర్దార్ పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గుండగాని కవిత, నాయకులు

తుంగతుర్తి, ఏప్రిల్ 2: బహుజనవీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ గుండగాని కవిత అన్నారు. ర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని 365జాతీయ రహదారి పక్కన గోపగాని రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె మాట్లాడారు. సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య, గడ్డం ఉప్పలయ్య, పులుసు ఉప్పలయ్య, తీగల వెంకన్న, పులుసు వెంకట నారాయణ, గోపగాని శ్రీనివాస్‌గౌడ్, గోపగాని వెంకన్న, తొట్ల సుధాకర్, పాలకుర్తి వీరయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్: సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలను సాధించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ కోరారు. మండలంలోని బూరుగడ్డ గ్రామంలో పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో భిక్షం, వెంకయ్య, గురవయ్య, మట్టపల్లి, నర్సింహారావు, వెంకన్న, సైదులు, వీరబాబు, గురుస్వామి, గోపాలం, శివాజీ పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో పాపన్న విగ్రహానికి గౌడ విద్యార్థి సంఘం నాయకుడు మోల్కపురి శ్రీకాంత్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకన్నగౌడ్, చిత్తలూరి కృష్ణమూర్తి, లింగస్వామి, యాదగిరిగౌడ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 2: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని డీఆర్డీఏ పీడీ జి.మధుసూదన్‌రాజు అన్నారు. మంగళవారం మండలంలోని మహ్మదాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అజయ్‌నాయక్, సీసీ చెన్నయ్య, వీవోఏ విజయ, నిరజ, ఇంద్రమ్మ, సుమతి పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో నాగారం ఆగ్రో రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎఫ్‌పీసీ ఎండీ కోడవకంటి వెంకన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు చిత్తలూరి వెంకన్న, లింగాల నర్సయ్య, నాగారాజు, ఆంజనేయులు రైతులు పాల్గొన్నారు.

తిరుమలగిరిరూరల్: మండలంలోని తొండ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం సైదులు ప్రారంభించారు.

ఎకరాకు రూ.25వేలు పరిహారం చెల్లించాలి

ఆత్మకూర్(ఎస్), చివ్వెంల, ఏప్రిల్ 2: నీరు లేక వరి పైర్లు ఎండిపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లించి ఆదుకోవాలని బీఆర్ఎస్ ఆత్మకూర్(ఎస్) మండల అధ్యక్షుడు తూడి నరసింహారావు, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మాజీ ఎంపీపీ రైతు నర్సింహారావు, సర్పంచ్ జూలకంటి సుధాకర్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తూడి నరసింహారావు, చివ్వెంలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతు నర్సింహారావు, సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వంలో రైతులు ఏనాడు ఇబ్బందులు పడలేదన్నారు. కార్యక్రమంలో ముద్దం కృష్ణారెడ్డి, మర్ల చంద్రారెడ్డి, మల్లారెడ్డి, వెంకటరెడ్డి, రంగారెడ్డి, దామిడి శ్రీను, భిక్షం, బత్తుల ప్రసాద్, భూక్యా నాగునాయక్, ఏర్పుల నగేష్, రాములు, కోటేష్, హరీష్, దిలీప్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో జిల్లా మొదటి ర్యాంకు

కోదాడ రూరల్, ఏప్రిల్ 2: నవోదయ ఎంట్రన్స్ పరీక్ష 2024-25లో మండలంలోని నల్లబండగూడెం గ్రామానికి చెందిన యరమాల యజ్ఞశ్రీ చంద్రహాస్‌ను ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొదటి ర్యాంకు సాధించినట్లు హెచ్ఎం పద్మావతి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న చంద్రహాస్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు మంగళవారం అభినందిరంచారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి

నూతన్‌కల్, ఏప్రిల్ 2: ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌వో కోటాచలం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వేసవిలో కాటన్ దుస్తులు ధరించాలని, తప్పనిసరి పరిస్థితులలో మాత్రమే బయటికి రావాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి, అశ్రిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్ విభాగంలో గోల్డ్‌మెడల్

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 2: ముంబైకి చెందిన రంగోత్సవం సెలబ్రేషన్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ డ్రాయింగ్ పోటీల్లో హుజూర్‌నగర్‌లోని గోవిందాపురానికి చెందిన నామా చరణ్ ఆర్ట్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించాడు. పేద కుటుంబానికి చెందిన చరణ్ తల్లి ఇందిర సహకారంతో ఆర్ట్ నేర్చుకుని గోల్డ్ మెడల్ సాధించడం పట్ల గోవిందాపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

కోదాడ: హుజూర్‌నగర్ గురుకుల పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి నిఖిల్ గోల్డ్‌మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రాధాకృష్ణ మూర్తి తెలిపారు. నిఖిల్ స్వగ్రామం అనంతగిరి మండలం కిష్టాపురం. అదేవిధంగా పాఠశాలకు చెందిన గార్ల వేదనరాం ప్రతిభ కనబర్చాడని తెలిపారు. డ్రాయింగ్ పోటీల్లో తమ గ్రామానికి చెందిన విద్యార్థులు నిఖిల్, వేదనరాం రాణించటం అభినందనీయమని సర్పంచ్ అప్పారావు అన్నారు.

తూములు తీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పెన్‌పహాడ్, ఏప్రిల్ 2 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయడంతో కాల్వ తూములు, షట్టర్లు తీయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, మండల ప్రత్యేకాధికారి రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన తాగునీటి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాల్వ నీరు సజావుగా పాలేరుకు చేరేవిధంగా అందరూ సహకరించాలన్నారు. సాగర్ నీటి నిండిన పాలేరు నుంచి మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందన్నారు. సాగర్ ఎడమ కాల్వ నీరు తూముల ద్వారా బయటకు తీయకుండా రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు నిరంతరం సాగర్ ఎడమ కాల్వపై పర్యవేక్షణ చేయాలన్నారు. తూములు తీయకుండా ఉండేందుకు డ్యూటీలు వేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్ రావు, డీటీ లాల్ నాయక్, ఎంపీవో నరేష్, ఎస్ఐ రవీందర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు వేతనాలు చెల్లించాలి

మునగాల రూరల్, ఏప్రిల్ 2: 'ఉపాధి' కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో 'ఉపాధి' పనుల ప్రదేశాన్ని సందర్శించి మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 'ఉపాధి' కూలీలకు రోజుకు రూ.600 కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు ఏర్పాటుచేయాలని, చేసిన పనికి వారంరోజుల్లో డబ్బు చెల్లించాలన్నారు. ఎండ తీవ్రంగా ఉన్నందున కూలీలకు పని ప్రదేశంలో టెంట్ సౌకర్యంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. గత సంవత్సరం వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని, జిల్లాస్థాయి అధికారులు జోక్యం చేసుకుని పెండింగ్ వేతనాలు యుద్ధప్రాతిపదికన చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధిహామీ మేట్లు వెంకన్న, తిమ్మారెడ్డి సైదిరెడ్డి, నరేందర్, ఉపాధిహామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్: ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్‌భవన్‌లో ఆత్మకూర్(ఎస్)మండలం తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన బీఎస్పీ నాయకుడు నాగరాజుతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, రమేష్, పిడమర్తి లింగయ్య, గోగుల వీరబాబు, పద్మ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కారించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగంధర్ కోరారు. పెన్‌పహాడ్ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యానికి ప్రభుత్వం క్వింటాకు రూ.500లు బోనస్ చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పొదిల నాగార్జున, ఊరుకొండ రాధకృష్ణ, యగ్గడి మురళి, కొండ జానకిరాములు, రంగినేని రాజేష్ పాల్గొన్నారు

● కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం కృషి చేయాలని పెన్‌పహాడ్ ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పాఠశాల అభివృద్ధిపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తించిన పాఠశాలల్లో 15రోజుల లోపు మౌలిక వసతుల రూపకల్పనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నకిరేకంటి రవి, ఏపీఎం అజయ్‌నాయక్, పీఆర్ఏఈ కిరణ్ కుమార్, హెచ్ఎంలు, విద్యాకమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: వేసవిలో బాటసారులకు సహకారం అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యువక మండలి సభ్యులు కాకి శ్రీధర్, పందిరి గోపిరెడ్డి, వంగవేటి రూపేష్‌కుమార్, కోరారు. వంగవేటి ప్రసాద్ 13వ వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఇందిర సెంటరులో బాటసారులకు ఆయన మిత్రులు 200లీటర్ల మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప్పల రమేష్, కుక్కడపు కోటేశ్వరరావు, ఉప్పల రామ్‌నరేష్, బూరుగు శ్రీనివాస్, ఎలక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జక్కుల నాగేశ్వరరావును పలు పార్టీల నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో దగడ గోపి, రాజశేఖర్, బాషా, సాయి, జయంత్, పాల్గొన్నారు.

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన నకిరేకంటి కోటయ్య మృతి చెందగా, ఆయన కటుంబ సభ్యులను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, గుగులోతు కృష్ణానాయక్, కీత రామారావు, పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంబిరెడ్డి మృతి పరామర్శించి రూ.8వేలు ఆర్థికసాయం అందజేశారు. అప్పన్నపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త షేక్ జాను గుండెపోటుతో మరణించగా ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు మేకల స్రవంతిశోభన్‌బాబు, కడవ ఇసాక్, మాజీ సర్పంచ్ ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు

కోదాడ: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని రిటైర్డు ప్రిన్సిపాల్ పి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక తేజ టాలెంట్ స్కూల్లో 'చిల్డ్రన్ కార్నివాల్' పేరిట నిర్వహించినవార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి కార్యక్రమంలో రామచంద్రా మిషన్ జోనల్ కోఆర్డినేటర్ సీహెచ్ వరప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, సోమిరెడ్డి, అప్పారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు జూకూరి అంజయ్య, ఆలయ సెక్రటరీ కోట తిరుపతయ్య, అన్నదాన నిర్వాహకులు హనుమంతురావు పాల్గొన్నారు.

చిలుకూరు: వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి రూపేందర్‌సింగ్, ఎంపీడీవో గిరిబాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు గ్రామాల్లో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు నవ్య, సుశీల, సీహెచ్‌వో వినోద్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేక అధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక తయారు చేసి జిల్లా అధికారులకు పంపామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

చివ్వెంల, నూతనకల్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు నిబద్ధతతో పనిచేయాలని ఎంఎస్‌వో కె.జగదీశ్వర్‌రెడ్డి సూచించారు. చివ్వెంల ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన అమ్మఆదర్శ పాఠశాల కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, నోడల్ అధికారులు రేణుక, ఆర్అండ్‌బీ ఏఈ యుగేందర్, ఎంపీవో గోపి, ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

● ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ఎంపికను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీవో సునీత కోరారు. నూతనకల్ మండల పరిషత్ కార్యాలయంలో హెచ్ఎంలకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో రాములు నాయక్, ఏపీఎం కరుణాకర్ పాల్గొన్నారు.